క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

శంఖవరం: స్థానిక ఆదర్శ పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి గాను 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కె.కృష్ణవేణి తెలిపారు. పాఠశాల కార్యాలయంలో సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 6 తేదీ లోగా విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు పాఠశాలలో రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, కుల ధ్రువీకరణ పత్రం, తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్‌కార్డుల జెరాక్స్, టీసీ, పరీక్ష ఫీజు చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి దానిలో ప్రతిభ ఆధారంగా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు. విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కరాటేపై విద్యార్థులకు శిక్షణ



ఏలేశ్వరంలో విద్యార్థులకు కరాటే విద్యపై శిక్షణ ఇస్తున్న మాస్టర్ శ్రీనివాసరావు

ఏలేశ్వరం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం కరాటే విద్యపై శిక్షణ ఇచ్చారు. లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ శిడగం శ్రీనివాసరావు విద్యార్థులకు కరాటే విద్యలో మెళకువలు నేర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కరాటే నేర్చుకుంటే అత్యవసర పరిస్థితుల్లో ఆత్మరక్షణ పొందవచ్చన్నారు. విద్యార్థినులకు కరాటే రక్షణ కవచమన్నారు. కరాటేతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని, విద్యార్థులు కరాటే విద్యపై పూర్తిస్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కార్మికుల ఆందోళన



చిన్నింపేటలోని జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

ఏలేశ్వరం: మండల పరిధిలోని చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికుల తొలగింపును నిరసిస్తూ సోమవారం ఆందోళన చేశారు. సీఐటీయూ నాయకుడు రొంగల ఈశ్వరరావు ఆధ్వర్యంలో చిన్నింపేట జీడిపిక్కల ఫ్యాక్టరీ వద్ద కార్మికుల ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న సుమారు 80 మంది కార్మికులను ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. జిల్లాలోని జీడిపిక్కల ఫ్యాక్టరీలు కార్మికులకు ఉపాధి కల్పించడంతో పాటు ఉత్పత్తి పెంచి లాభాలు సాధిస్తుంటే ఇక్కడి యాజమాన్యం కార్మికులను తొలగించడం దారుణమన్నారు. కార్మికుల తొలగింపుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

5 నుంచి నీలమ్మతల్లి జాతర

సామర్లకోట: నీలమ్మ చెరువు వద్ద ఉన్న నీలమ్మ తల్లి ఆలయంలో ఈ నెల ఐదో తేదీ నుంచి జాతర ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ నాయకులు తెలిపారు. నీలమ్మ చెరువు తవ్వకం చేస్తున్న సమయంలో సుమారు 130 ఏళ్ల క్రితం చిన్న రాతి విగ్రహం బయట పడింది. దాంతో ఆ అమ్మవారిని నీలమ్మగా గుర్తించడంతో, చెరువుకు నీలమ్మ చెరువుగా పేరొచ్చింది. ఆ రాతి విగ్రహానికి చిన్న గుడి కట్టించి, నిత్యం ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. ఏటా జూన్ మాసంలో ఉత్సవాలు నిర్వహించడం అనవాయితీగా మారింది. అమ్మవారి జాతరలో సిరి బొమ్మ ఊరేగింపు సమయంలో చిరు జల్లులు కురియడంతో ప్రారంభమవుతుందని నిర్వాహకులు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే జాతరలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. జూన్ ఐదు నుంచి మూడు రోజుల పాటు జాతర ఉత్సవాలు జరుగుతాయి.

వేసవి విజ్ఞాన శిబిరాలను వినియోగించుకోవాలి



ఉప్పాడలో తాము వేసిన బొమ్మలు చూపుతున్న విద్యార్థులు

కొత్తపల్లి: గంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయాధికారి టి.నళినీ ప్రియ సూచించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లిష్, చిత్రలేఖనం, కథలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

- నేడే సార్వత్రిక ఎన్నికల తుది తీర్పు
- గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్న అభ్యర్థులు
- సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి



కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు



కౌంటింగ్ ఏర్పాట్లపై చర్చిస్తున్న ఎన్నికల అధికారులు

తుని: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు సర్వం సిద్ధమైంది. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలతో పాటు ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తుది తీర్పు వెలువడే క్షణాలు రానే వచ్చేసాయి. మంగళవారం ఓట్లు లెక్కింపు నిర్వహించడానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజలందరి చూపు కాకినాడలో జరగే కౌంటింగ్ వైపే ఉంది. సోమవారం ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థులు, కౌంటింగ్ ఏజెంట్లు జిల్లా కేంద్రానికి తరలి వెళ్లారు. మంగళవారం ఉదయం 8 గంటలకు అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాల కౌంటింగ్ పక్రియ ప్రారంభమవుతుంది. తొలిత పోస్టల్ బ్యాలెట్, సర్వీసు ఓట్లను లెక్కిస్తారు. తర్వాత ఈవీఎంలను తెరిచి లెక్కిస్తారు.

నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు

తుని నియోజకవర్గంలో మొత్తం 2,24,945 ఓట్లు ఉండగా 1,87,215 ఓట్లు పోలయ్యాయి. కౌంటింగ్‌కు 14 టేబుల్స్ ఏర్పాటు చేశారు. 16 రౌండ్లలో ఓట్లను లెక్కిస్తారు. ఒకవేళ అవసరమైతే 16 వీవీ ప్యాట్స్‌ను లెక్కించనున్నారు. లాటరీ పద్ధతిలో నియోజకవర్గం నుంచి 5 వీవీ ప్యాట్స్‌ను ఎంపిక చేస్తారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌లో ఒకే విధంగా ఓట్లు ఉంటే ఫలితాలను సకాలంలోనే ప్రకటిస్తారు. ఎక్కడైనా తేడా ఉంటే రీకౌంటింగ్ చేస్తారు. అధికారికంగా సాయంత్రానికి ఫలితాలు ప్రకటించే అవగాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

ఏజెంట్లు సిద్ధం

కౌంటింగ్‌లో పాల్గొనడానికి అన్ని రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు తమ ఏజెంట్లను సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీల నేతలు తమ ఏజెంట్లకు శిక్షణ పూర్తి చేశారు. కౌంటింగ్ పక్రియపై ఎన్నికల సంఘం కట్టుదిట్టమైన ఆంక్షలు విధించడంతో ఫలితాలు ఎప్పటికప్పుడు బయటకు రాకుండా కేవలం ఎన్నికల సంఘం ద్వారా మాత్రమే బయటకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏజెంట్లు, మీడియాతో సహా ఎవరి వద్ద కూడా సెల్‌ఫోన్లు సైతం లేకుండా చర్యలు తీసుకున్నారు.

అభ్యర్థుల్లో అలజడి

ఐదేళ్ల భవిష్యత్ ఈవీఎంల్లో దాగి ఉంది. ఓట్ల లెక్కింపునకు గంటల సమయం ఉన్న నేపథ్యంలో ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల్లో అలజడి మెదలైంది. 2014, 2019 ఎన్నికల్లో తుని నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసిన దాడిశెట్టి రాజా విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో టీడీపీ నుంచి యనమల కృష్ణుడు పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి యనమల రామకృష్ణుడు కుమార్తె యనమల దివ్య అసెంబ్లీ బరిలో ఉన్నారు. వీరిద్దరి మధ్యనే ప్రధాన పోటీ ఉంది. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దాడిశెట్టి రాజా మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలని చూస్తున్నారు. కాకినాడ జెఎన్‌టీయూలో తుని నియోజకవర్గానికి సంబంధించి కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి కేవీ రామలక్ష్మి తెలిపారు.

హోటల్స్ ఫుల్

ఓట్ల లెక్కింపులో ఎవరు విజయం సాధిస్తారో తెలియదు కాని హోటల్స్ యాజమానులకు పుష్కలంగా ఆదాయం సమకూరింది. తుని పట్టణంతో పాటు అన్నవరంలో ఉన్న రూమ్‌లు నిండిపోయాయి. ఇందులో ఆయా పార్టీలకు చెందిన కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు. టీవీల్లో లైవ్ ప్రచారాలను తిలకించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేసుకున్నారు. ఎక్కడ చూసినా ఎన్నికల ఫలితాలపై చర్చించుకుంటున్నారు.

18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు

గోకవరం: జగ్గంపేట నియోజకవర్గ ఓట్ల లెక్కింపు 18 రౌండ్లలో నిర్వహిస్తున్నట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,29,863 మంది ఓటర్లు ఉండగా గత నెల 13న జరిగిన పోలింగ్‌లో 1,92,458 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 96,323 మంది, మహిళలు 96,132 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారన్నారు. మొత్తం 83.72 శాతం ఓటింగ్ నమోదైంది. నాలుగు మండలాల్లో మొత్తం 248 పోలింగ్ బూత్‌లో ఉండగా మంగళవారం నిర్వహించే కౌంటింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. 18 రౌండ్లలో ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు వెల్లస్తామని వివరించారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

జగ్గంపేట నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఈ నెల 1న ప్రకటించిన ఎగ్జిట్ పోల్స్‌లో అత్యధిక సంస్థలు వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని ప్రకటించడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. జగ్గంపేటలో తోట నరసింహం ఎమ్మెల్యేగా గెలుపొందుతారని ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఫలితాల కోసం నియోజకవర్గ ప్రజలు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఎగ్జిట్ పోల్స్ సర్వేలతో బెట్టింగ్‌లు జోరుగా సాగుతున్నాయి. నాలుగు మండలాల్లో బెట్టింగ్ రాయుళ్లు లక్షల్లో పందేలు కాస్తున్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట నరసింహం ధీమా వ్యక్తం చేశారు. తాను మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందుతానని, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తుందన్నారు. ప్రజల ఆశీస్సులతో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతున్నారని చెప్పారు.

పోలీసులు అప్రమత్తం

ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అల్లర్లు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే గత వారం రోజుల నుంచి గ్రామాలను జల్లెడపడుతున్న పోలీసులు సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ పార్టీల నాయకులతో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంగించిన వారిపై కేసులు నమోదు చేశారు.

నేడే ఉత్కంఠకు తెర



ఓట్ల లెక్కింపు జరిగే కాకినాడ జేఎన్‌టీయూ

ఏలేశ్వరం: సార్వత్రిక ఎన్నికల ఫలితాలు మంగళవారం తేలనుండడంతో నియోజకవర్గవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది. ఉదయం 8 గంటల నుంచి లెక్కింపు ప్రారంభం కానుండగా మొదటగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కించనున్నారు. 8.30 గంటల నుంచి ఈవీఎంలను లెక్కిస్తారు. ఉదయం 10 గంటలకు మొదటి రౌండ్ ఫలితం వెలువడే అవకాశం ఉంది.

నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో 2,17,267 మంది ఓటర్లు ఉండగా 1,74,788 మంది ఈవీఎంల ద్వారా ఓటుహక్కు వనియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1777 ఉద్యోగులు, ఎన్నికల సిబ్బంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈసారి ఎన్నికల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ జరగడం విశేషం. ముఖ్యంగా మహిళలు రాత్రి వరకూ క్యూలైన్‌లో నిలబడి ఓటుహక్కు వినియోగించుకోవడం ప్రత్యేకతను సంతరించుకుంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సిద్ధం సభలకు మహిళలు అధికసంఖ్యలో తరలిరావడంతో వారి ఓట్లు వైఎస్సార్ సీపీకే అనుకూలమని విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.

ఏలేశ్వరమే కీలకం

సార్వత్రిక ఎన్నికల్లో ప్రతిసారి ఏలేశ్వరం మండలంతో పాటు ఏలేశ్వరం నగర పంచాయతీ కీలకపాత్ర పోషిస్తున్నాయి. ఓట్ల లెక్కింపు ఏలేశ్వరం మండలం నుంచే ప్రారంభం కానుంది. గత ఎన్నికల్లో ఏలేశ్వరం మండలంలో ఏ పార్టీ మెజార్టీ సాధిస్తే ఆ పార్టీనే విజయం సాధించింది. ముఖ్యంగా ఏలేశ్వరం నగర పంచాయతీలో ఏ పార్టీకి మెజార్టీ వస్తోంది ఆ పార్టీనే గెలుస్తుందనే సెంటిమెంట్ ఉంది. దీంతో అందరి దృష్టి ఏలేశ్వరం వైపే మళ్లింది.

బరిలో 15 మంది అభ్యర్థులు

ప్రత్తిపాడు నియోజకవర్గానికి సంబంధించి ఈసారి ఎన్నికల్లో అధికంగా 15 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వైఎస్సార్ సీపీ నుంచి వరుపుల సుబ్బారావు, టీడీపీ నుంచి వరుపుల సత్యప్రభ, కాంగ్రెస్ పార్టీ నుంచి నీరుకొండ సత్యనారాయణ, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ నుంచి ఏగుపాటి అర్జునరావుతో పాటు పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేశారు. పోటీ ప్రధానంగా వైఎస్సార్ సీపీ, టీడీపీ మధ్యే నెలకొంది. టీడీపీ అభ్యర్థి వరుపుల సత్యప్రభ తొలిసారి పోటీచేయగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరుపుల సుబ్బారావు ఇప్పటికే ఆరు సార్లు పోటీ చేసి రెండుసార్లు విజయం సాధించారు.

16 రౌండ్లలో లెక్కింపు

ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఓట్లను 16 రౌండ్లల్లో లెక్కించనున్నారు. నియోజకవర్గంలో 227 పోలింగ్‌బూత్‌లు ఉండగా 14 టేబుళ్ల ద్వారా 16 రౌండ్లలో లెక్కింపు జరగుతుందని ఈఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం ఫలితాలు వెలువడనున్నాయి.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు



గోకవరంలో కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కంబాల శ్రీనివాసరావు

గోకవరం: స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో కళాభారతికి వందనం తరగతుల్లో కూచిపూడి, సంగీతం శిక్షణ పొందుతున్న విద్యార్థులకు సోమవారం ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేతు వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని కంబాల శ్రీనివాస్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. కంటి వైద్యులు డాక్టర్ స్వరూపారాణి, సిబ్బంది రామసత్యనారాయణ సుమారు 300 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, ఇనకోటి బాపన్నదొర, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

వ్రత పురోహితుడు 'పాలంకి' సేవలు మరువలేనివి



సత్యనారాయణ మూర్తి దంపతులను సత్కరిస్తున్న వ్రతపురోహిత సంఘం నాయకులు

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో సుమారు 40 సంవత్సరాల పాటు వ్రతపురోహితుడిగా సేవలందించిన స్పెషల్ గ్రేడ్ వ్రతపురోహితుడు పాలంకి సత్యనారాయణ మూర్తి సేవలు మరువలేనివని దేవస్థానం వైదిక కమిటీ సభ్యుడు ఛామర్తి వేంకటరెడ్డి పంతులు కొనియాడారు. ఉద్యోగ విరమణ చేసిన పాలంకి సత్యనారాయణ మూర్తి దంపతులను వ్రతపురోహిత సంఘం ఆధ్వర్యాన సోమవారం ఘనంగా సత్కరించారు. వ్రతవిభాగ ఏఈఓ పి.జగ్గారావు ముఖ్య అతిథిగా హాజరై పాలంకి సేవలను కొనియాడారు. అనంతరం వ్రతపురోహిత సంఘం సభ్యులు పాలంకి సత్యనారాయణ మూర్తి దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించి సత్యదేవుని ఫొటో బహూకరించారు. గ్రాట్యుటీ చెక్కును ఏఈఓ జగ్గారావు వారికి అందచేశారు. కార్యక్రమంలో స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు మంధా శ్రీరామమూర్తి, ప్రయాగ అంజిబాబు, నాగాభట్ల వీరభద్రశర్మ, ఛామర్తి జగ్గారావు, వ్రతపురోహిత సంఘం మాజీ అధ్యక్షుడు రవిశర్మ, పురోహితులు అల్లం రాజు శ్రీనివాస్, పాలంకి పట్టాభి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

తునిలో భారీ వర్షం

తుని రూరల్: మండల వ్యాప్తంగా ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. రాత్రి 12 గంటల నుంచి రెండు గంటలు వరకూ వర్షం కురుస్తూనే ఉంది. మండలంలో డి.పోలవరం, ఎస్.సూరవరం, కొలిమేరు, రేఖవానిపాలెం, తేటగుంట, టి.తిమ్మాపురం, కుమ్మరిలోవ, తాళ్లూరు, హంసవరం, ఎస్.అన్నవరం, వి.కొత్తూరు, లోవకొత్తూరు, కేఓ.మల్లవరం, రాపాక తదితర గ్రామాల్లో వర్షం కురవడంతో సోమవారం వాతావరణం చల్లబడింది. ఈ వర్షంతో సాగునీటి చెరువులు, తాండవ రిజర్వాయర్‌లో స్వల్పంగా నీరు చేరింది. 380 అడుగుల గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం గల రిజర్వాయర్‌లో శనివారం నాటికి 355.4 అడుగులు నీటి నిల్వలు ఉండగా సోమవారం ఉదయానికి 356.17 అడుగులకు పెరిగినట్టు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. విస్తారంగా వర్షాలు కురిస్తే ఈ సంవత్సరం సకాలంలో ఖరీఫ్ వరినాట్లు వేస్తామని రైతులు తెలిపారు.

తలుపులమ్మతల్లి ఆలయం వద్ద అన్నదానం

కోటనందూరు: స్థానిక పోలీసుస్టేషన్ సమీపంలో వేంచేసిన తలుపులమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా ఆలయ ప్రాంగణంలో సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. గ్రామ ప్రజల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పలు రకాల వంటకాలతో అన్నదానం చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఆరు వేల మంది భక్తులు పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

లెక్కింపు కేంద్రానికి పోస్టల్ బ్యాలెట్ల తరలింపు




ప్రత్తిపాడు స్ట్రాంగ్ రూం నుంచి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను కాకినాడ తరలిస్తున్న అధికారులు

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని స్ట్రాంగ్ రూం నుంచి పోస్టల్ బ్యాలెట్ బాక్సులను సోమవారం పోలీసులు, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో కాకినాడలోని కౌటింగ్ కేంద్రానికి తరలించారు. నియోజకవర్గంలోని ఎన్నికల విధులు నిర్వర్తించే 1,778 మంది పీఓ, ఏపీఓ, ఓపీఓలతో పాటు సర్వీసు ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఈ పోస్టల్ బ్యాలెట్ బాక్సులను ప్రత్తిపాడు శాసనసభా నియోజకవర్గ ఓట్ల లెక్కింపు చేపట్టనున్న కాకినాడ జేఎన్‌టీయూకేలోని అంబేడ్కర్ లైబ్రేరీ భవనంలోని 3వ అంతస్తుకు ప్రత్యేక వాహనంలో తరలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు ఆచంట రాంబాబు, ఏలేశ్వరం ఎంపీపీ గోల్లపల్లి బుజ్జి, బీజేపీ నాయకుడు శింగిలిదేవి సత్తిరాజు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, మాజీ ఎంపీటీసీ శెట్టిబత్తుల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బలగాల మోహరింపు

ఓట్ల లెక్కింపు జరుగుతున్న తరుణంలో గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భారీ ఎత్తున పోలీసులు మోహరించారు. డీఎస్పీ పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ, ఆరుగురు ఎస్సైలు, వంద మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి, చినశంకర్లపూడి, ఏలేశ్వరం మండలంలోని ఏలేశ్వరం, పెద్దనాపల్లి, శంఖవరం మండలంలోని శంఖవరం, మండపం, రౌతులపూడి మండలంలోని ములగపూడి, ఎస్ అగ్రహారం గ్రామాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేస్తున్నారు. మరో మొబైల్ టీంతో గస్తీ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రత్తిపాడు సీఐ ఎం.శేఖర్‌బాబు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



కాట్రావులపల్లిలో పర్యటించిన డీఎస్పీ లతాకుమారి

కోటనందూరు: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లో ఉన్న నేపథ్యంలో పోలీసుల హెచ్చరికలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ఎస్సై శంకర్ హెచ్చరించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఎన్నికల కౌంటింగ్ జరగనున్న నేపథ్యంలో 144 సెక్షన్, 32 పోలీసు యాక్ట్ అమల్లో ఉంటాయన్నారు. ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకూ గ్రామాల్లో రోడ్లపై గుమికూడడం, ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించడం, బాణసంచా కాల్చులు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రామాల్లో 144 సెక్షన్ అమలు

రౌతులపూడి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ మంగళవారం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటాయని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలు ఉన్నందున ప్రజలు రోడ్లపై గుమికూడటం, ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సోషల్ మీడియాపై ఆంక్షలు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ప్రజలు శాంతియుతంగా ఉండాలి

కిర్లంపూడి: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో మండళవారం గ్రామాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటాయని కిర్లంపూడి ఎస్సై షేక్ జబీర్ సోమవారం తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు శాంతియుతంగా ఉండాలని, లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజలకు కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. గ్రామాల్లో డీజేలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలి


గోకవరం: ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో ఉండాలని తహసీల్దార్ బి.హేమకుమారి, డీటీ ఎ.రజని, ఎస్సై కె.నాగరాజు సూచించారు. మండల వ్యాప్తంగా మంగళవారం 144 సెక్షన్, పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉంటాయన్నారు. ప్రజలు గుమిగూడి ఉండకూడదన్నారు. ఎటువంటి బాణసంచా కాల్చులు, ఊరేగింపులు, సన్మానాలు, సమావేశాలకు అనుమతులు లేవన్నారు. అలాగే పెట్రోల్ బంకుల్లో లూజు విక్రయాలు నిషేధమన్నారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్రామాల్లో పోలీసుల గస్తీ

జగ్గంపేట: ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఎటువంటి అవాంఛనీయ సంఘనటన చోటు చేసుకోకుండా పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాల్లో గస్తీ ముమ్మరం చేశారు. మండలంలోని కాట్రావులపల్లి, జగ్గంపేట పరిసర గ్రామాల్లో సోమవారం డీఎస్పీ లతాకుమారి, జగ్గంపేట సీఐ లక్ష్మణరావు పర్యటించారు. ఎన్నికల కోడ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎటువంటి సమావేశాలు, ఉరేగింపులు నిర్వహించరాదన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. విజయోత్సవ ర్యాలీలు ఈ నెల 6వ తేదీ తరువాతే నిర్వహించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎస్సై నాగార్జునరాజు తదితరులు పాల్గొన్నారు.

వ్రతాలకు మారేడు పత్రి కొరత

- జమ్మి పత్రితో సత్యదేవుని వ్రతాల నిర్వహణ
- ఏటా వేసవితో ఇదే పరిస్థితి



ఐషర్ వ్యాన్‌లో రత్నగిరికి తీసుకువచ్చిన జమ్మి పత్రి

అన్నవరం: సత్యదేవుని వ్రతాల్లో ఉపయోగించే మారేడు పత్రికి కొరత ఏర్పడింది. దీంతో జమ్మి పత్రితో స్వామివారి వ్రతాలు నిర్వహిస్తున్నారు. రత్నగిరి వాసుడు సత్యదేవుని ఆలయంలో భక్తులు ఆచరించే స్వామివారి వ్రతానికి ఎంత ప్రాముఖ్యత ఉందో అందరికీ తెలిసిందే. స్వామివారి ఆలయానికి వచ్చే భక్తుల్లో అధికశాతం మంది సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తారు. ఈ వ్రతాల్లో మారేడు పత్రినే ఎక్కువగా ఉపయోగిస్తారు. కాగా ఏటా వేసవి కాలంలో మారేడు చెట్లు ఎండిపోవడంతో వ్రతాల్లో జమ్మి పత్రి వాడాల్సి వస్తోందని దేవస్థానం అధికారులు తెలిపారు.

విశాఖ, అల్లూరి జిల్లాల నుంచి...

సత్యదేవుని వ్రతాలకు అవసరమైన మారేడు పత్రిని విశాఖ, అల్లూరి జిల్లాల నుంచి సేకరిస్తారు. మన్యంలో విస్తారంగా మారేడు చెట్లు ఉంటాయి. వారానికి రెండు, మూడు సార్లు వెళ్లి అక్కడ చెట్లు నుంచి సేకరించి ఐషర్ వాన్ ద్వారా దేవస్థానానికి తీసుకువచ్చి కోల్డ్ స్టోరేజీలో భద్రపరిచి వ్రతాల్లో పత్రిగా ఉపయోగిస్తారు. వేసవి కాలం ప్రారంభం కాగానే మారేడు చెట్లు ఆకులు రాల్చేస్తాయి. ఫలితంగా మారేడు పత్రి దొరకదు. దీంతో జమ్మి పత్రిని రాజానగరం తదితర ప్రాంతాల నుంచి సేకరించి దేవస్థానానికి తరలించి కోల్డ్ స్టోరేజీలో భద్రపరుస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభం కావడంతో మరో నెల రోజుల్లో మళ్లీ మారేడు పత్రి లభ్యమవుతుందని అధికారులు తెలిపారు.



జమ్మి పత్రితో సత్యదేవుని వ్రతాలు చేయిస్తున్న పురోహితులు